క్లుప్తంగా

మహాగణపతికి 89 కేజీల లడ్డూ నివేదన



గణపతికి సమర్పించిన లడ్డూ

గాజువాక: ఎస్వీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో గాజువాక నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాలకు తాపేశ్వరానికి చెందిన సురుచి ఫుడ్స్ నిర్వాహకులు భారీ లడ్డూ అందజేశారు. 89 అడుగుల మహాగణపతికి 89 కేజీల లడ్డూను ప్రసాదంగా అందజేసినట్టు ఉత్సవ నిర్వాహకుడు గణేష్ తెలిపారు. ఈనెల 29న స్వామివారి నిమజ్జనోత్సవం సందర్భంగా లడ్డూను వేలం వేస్తామని గణేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పల్లా కార్తీక్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పల్లా కార్తీక్, సురుచి ఫుడ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాన్‌కార్డు మేళాకు స్పందన

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది సౌకర్యం కోసం కళాశాల యాజమాన్యం సోమవారం పాన్ కార్డుల మేళా నిర్వహించింది. 500 మంది విద్యార్థులు పాన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు పాల్గొన్నారు.

ఆటల పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: వర సిద్ధి వినాయక ఉత్సవాలను 87వ వార్డు కణితి కాళింగ వీధి రామాలయం ఆవరణలో ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా మండపం వద్ద పిల్లలకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, జిల్లా కార్యదర్శి ప్రగడ వేణుబాబు బహుమతులు అందించారు. కార్యక్రమంలో దుగ్గపు దానప్పలు, ప్రగడ శ్రీనివాసరావు, శంకరరావు, బొడ్డ సన్యాసిరావు, గున్న రామారావుతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం



మేనేజర్‌కు నగదు అందిస్తున్న బొర్రమాంబ పారాయణ సేవా సమితి ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడికి చెందిన బొర్రమాంబ పారాయణ సేవా సమితి ప్రతినిధులు వరద బాధితుల సహాయార్థం రూ.5వేల నగదు అందించారు. సమితి అధ్యక్ష, కార్యదర్శులు చిత్తా జానకీదేవి, తలారి లలిత కుమారిలు అగనంపూడి యూనియన్ బ్యాంక్‌లో మేనేజర్ ద్వారా ప్రభుత్వ ఖాతాకు జమచేశారు.

5,331 మంది లైసెన్సుల రద్దు



వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

గోపాలపట్నం: హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేసినట్టు ఉప రవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. ఈ నెల 2 నుంచి 11 వరకు చేపట్టిన తనిఖీల్లో 5,985 మందిపై కేసులు నమోదు చేయగా 5,331 మంది వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్‌లు తాత్కాలికంగా రద్దు చేసినట్టు చెప్పారు. వాహనాల చట్టం సెక్షన్ 207 ప్రకారం డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు.

మురుగు కదలదు.. కంపు వదలదు

- పడకేసిన పారిశుధ్యం
- జ్వరాల బారిన పడుతున్న ప్రజలు
- పత్తాలేని దోమల మందు పిచికారీ, ఫాగింగ్



72వ వార్డు వుడాకాలనీ ప్రధాన రహదారిలో కాలువ దుస్థితి

పెదగంట్యాడ: ఏ వీధి చూసినా చెత్త మయం.. కాలువలు పూడిక మయం.. నివాస గృహాలు, ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోయి దోమలకు ఆవాసాలుగా మారాయి.. ఇదీ పెద గంట్యాడ మండల పరిధిలోని అన్ని వార్డుల్లో పరిస్థితి. చెత్తా చెదారం ఎక్కడపడితే అక్కడ డంప్ చేస్తున్నారు. ఫాగింగ్ ఊసే లేదు.దీంతో దోమల వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. అయినా అధికారుల్లో చలనం లేదు. దోమల నియంత్రణకు ఆయిల్ స్ప్రే, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి చర్యలు కూడా కనిపించడం లేదు..



75వ వార్డు ప్రధాన రహదారిలో చెత్తాచెదారం

చిన్నపాటి వర్షానికే రోడ్లపైకి నీరు

ప్రధాన కాలువలు మొదలుకొని వార్డుల్లో ఉన్న కొన్ని అంతర్గత కాలువల్లో చుక్కనీరు ముందుకు పారే పరిస్థితి లేదు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే కాలువల్లో నీరు రోడ్లపైకి చేరుతుంది.

భరించలేని దుర్వాసన

ఏ వీధిలో చూసినా మురుగు కాలువలు పూడుకుపోయి కనిపిస్తున్నాయి. చెత్తాచెదారంతో నిండిపోయి ఉన్నాయి. కాలువలు పూడుకు పోవడంతో మురుగు ముందుకు పారే పరిస్థితి లేదు. ఫలితంగా దుర్వాసనతో పాటు దోమల బెడద అధికమైంది. కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరు ముందుకు వెళ్లడం లేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది.



74వ వార్డు ప్రధాన కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

జ్వరాలతో వణుకుతున్న ప్రజలు

మండలంలో పారిశుధ్యం లోపించడంతో జ్వరాలు విజృంభిస్తున్నాయి. విష జ్వరాలతో దగ్గు, ఒళ్లు నొప్పులతో జనం వణికిపోతున్నారు. చాప కింద నీరులా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ విస్తరిస్తోంది. అన్ని ఆస్పత్రులు జ్వర బాధితులతో కిక్కిరిసిపోతున్నాయి.



వుడా కాలనీ కాలువలో దొర్లుతున్న పంది

కాలువలు నిర్మించాలి



వుడా కాలనీ ప్రధాన రహదారిలో మురుగు కాలువలు నిర్మించాలి. కాలువలు లేకపోవడంతో వల్ల మురుగు నిలిచి పోయి ఇబ్బందులు పడుతున్నాం. రోడ్లపై మురుగు నీరు నిలుస్తోంది. దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నాం. చెత్తకూడా ఎప్పటికప్పుడు తొలగించడం లేదు. అధికారులు వెంటనే చర్యలు చేపట్టి కాలువలు నిర్మించాలి..

–సీ. నాగేశ్వరరావు, వుడాకాలనీ, పెదగంట్యాడ

నివారణ చర్యలు చేపడతాం



దోమల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడతాం. ఇటీవల కురిసిన వర్షాలకు దోమల సంతతి పెరుగుతోంది. కట్టడికి ప్రణాళికలు సిద్ధం చేశాం. డ్రైనేజీల్లో ఎప్పటికప్పుడు పూడికలు తీయిస్తాం .అన్ని వార్డుల అధికారులతో సమీక్షలు ఏర్పాటు చేసి కాలువల్లో నీరు నిల్వలేకుండా చర్యలు చేపడతాం..

–డాక్టర్ కిరణ్‌కుమార్, ఏఎంవోహెచ్, జోన్–6

కార్మికులకు వైద్య పరీక్షలు



కార్మికులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. సఫాయిమిత్ర సురక్ష ఆరోగ్య శిబిరంలో భాగంగా 60 మంది కార్మికులకు 144 వైద్య పరీక్షలు నిర్వహించినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివయ్య తెలిపారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. జీవీఎంసీ కార్మికులు నిత్యం పని చేస్తూ ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకు దోహదపడుతున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎ.జె.స్టాలిన్, రాజాన రామారావు, జోనల్ కమిషనర్ శేషాద్రి, సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, వైద్యాధికారులు డాక్టర్ భానుజ, డాక్టర్ జె.భారతి, తహసీల్దార్ టి.శ్రీవల్లి, పీహెచ్‌సీ సీహెచ్‌వో పి.నాగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నాయకులు

పెదగంట్యాడ: అన్నదానం చేసి పేదల కడుపు నింపడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 75వ వార్డు ధర్మాల వీధిలో పెంటమాంబ యువజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనను నాగిరెడ్డి ప్రారంభించారు. సభ్యులు ఎల్లయ్యరెడ్డి, పిట్ట రమణ, భాను శకంర్‌రెడ్డి, రామిరెడ్డి, సుమన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గాజువాక పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి,64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, నాయకులు గొందేశి మహేశ్వరరెడ్డి, తిప్పల నితీష్‌రెడ్డి, నీలాపు శ్రీనివాసరెడ్డి, అప్పలరెడ్డి, ధర్మాల రామ్మోహన్‌రెడ్డి, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌ఏ సర్క్యులర్ ఉపసంహరించాలి



డైరెక్టర్ పాండేకు వినతి అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: ఉక్కు యాజమాన్యం శనివారం విడుదల చేసిన ఇంటి అద్దె (హెచ్‌ఆర్‌ఏ), ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ, ఎల్‌టీఏ రద్దు సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, కోశాధికారి ఎస్.ఎ. నాయుడు కోరారు. ఈ మేరకు వారు సోమవారం స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి పాండేను కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే పెంచిన కరెంట్ చార్జీలను వెంటనే తగ్గించాలన్నారు. మంగళవారం నాటికి మిగిలిన సగం జీతం చెల్లించాలని డైరెక్టర్‌ను కోరారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

ఉక్కునగరం: సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్‌ను విలీనం చేయడంతోనే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఉక్కు కార్మిక సంఘాల నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వద్ద సోమవారం పెద్ద ఎత్తున ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల కార్మిక వర్గం తీవ్ర ఇబ్బందులు పడుతుందన్నారు. కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కి ప్రభుత్వ రంగాన్ని నాశనం చేస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రస్తుత పరిస్థితికు కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. పూర్తి సామర్థ్యంతో ప్లాంట్ నడిపితే మనుగడ ఉంటుందన్నారు. కార్మిక చట్టాల స్థానంలో ప్రవేశపెట్టిన 4 కోడ్‌లను ఉపసంహరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు కె.ఎస్.ఎన్. రావు, డి. ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు జె. అయోధ్యరామ్, యు. రామస్వామి, వై.టి.దాస్, జె. రామకృష్ణ, నరేష్‌కుమార్, వరసాల శ్రీనివాస్, దొమ్మేటి అప్పారావు, బి. డేవిడ్, మహాలక్ష్మి నాయుడు పాల్గొన్నారు.



ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వద్ద ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు



పూజలు చేస్తున్న బ్రహ్మకుమారీలు



వ్రతాల్లో పాల్గొన్న దంపతులు

అగనంపూడి: బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో సోమవారం అగనంపూడిలోని దివ్యజ్యోతి భవనంలో 108 మంది పుణ్య దంపతులచే సామూహిక సత్యనారాయణ వ్రతాలు వైభవంగా వ్రతాలు చేపట్టారు. రాజస్థాన్‌లోని మౌంట్ అబూ నుంచి వచ్చిన రాజయోగి బీకూ మంజునాథ్ బాయీజీ వ్రతం ముఖ్య ఉద్దేశ్యం, నిగూఢంగా ఉన్న ఆధ్యాత్మికతను వివరించారు. బ్రహ్మకుమారీస్ జిల్లా కోఆర్డినేటర్ బీకే సోమేశ్వరి అక్కయ్య మాట్లాడుతూ వ్రతాన్ని ఇంట్లో చేసుకుంటే వారి కుటుంబానికే ఫలితం దక్కుతుందని, అదే సామూహిక వ్రతాలు, బ్రహ్మకుమారీస్ సంస్థ ఆవరణలో చేపట్టడం ద్వారా లోక కల్యాణం, మానవాళికి మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జూసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ జి.పూర్ణానందశర్మ, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, అగనంపూడి ఇన్‌చార్జి బీకే రామకోటి, మెట్రో ఫార్మా ప్లాంట్ హెడ్ జె.శ్రీనివాసరావు, వసుధా ఫార్మా క్వాలిటీ మేనేజర్ శ్రీనివాసరావు, దాసరి శ్రీనివాసరావు, అగనంపూడి, గాజువాక బ్రహ్మకుమారీ సంస్థ హెడ్‌లు బీకే సత్య, బీకే మమత తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పందిరి రాట మహోత్సవం

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు కణితి గవర వీధిలో శ్రీ దుర్గా గౌరీ యూత్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం పందిరి రాట మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్ పాల్గొని పూజలు చేసి పందిరిరాట ఉడుపు క్యాక్రమం ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా దుర్గా గౌరీ యూత్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బొడ్డేటి మోదినాయుడు, ఆదారి శ్రీను, కోమటి రమాదేవి, సిరపశెట్టి నూతన్, ధైర్యలక్ష్మి, నాగసూరి అప్పారావు, మళ్ల రాము, కంద్రేగుల రాజేష్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గవరపాలెంలో శరన్నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోమటి శ్రీనివాసరావు, రమాదేవి దంపతులు, బొడ్డ గోవింద్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి సత్కారం

అక్కిరెడ్డిపాలెం: విజయవాడ వరద బాధిత ప్రాంతాల్లో సేవలు అందించి వచ్చిన 68వ వార్డు శానిటరీ సిబ్బందిని వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష ,లతీష్ దంపతులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరదల వల్ల అతలాకుతలమైన ప్రాంతంలో శానిటరీ పనులు చేపట్టిన కార్మికుల కృషి ఎనలేనిదన్నారు.



శానిటరీ సిబ్బందిని సత్కరిస్తున్న కార్పొరేటర్ గుడివాడ అనూష, లతీష్

టిడ్కో ఇళ్లు పంపిణీ చేయాలని ఆందోళన

పెదగంట్యాడ: సొంతింటి కలను నిజం చేస్తారని ఎనిమిదేళ్లుగా ఎదురు చూస్తున్నామని, కట్టిన ఇళ్లు మంజూరు చేయకపోయినా బ్యాంక్ రుణాలు కట్టాల్సి వస్తోందని టిడ్కో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క ఇంటి అద్దెలు చెల్లించలేక అవస్థలు పడుతుంటే మరో పక్క బ్యాంక్ రుణాలు కట్టాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. భానోజీ తోట, దయాళ్‌నగర్, దువ్వాడ తదితర ప్రాంతాల్లో 2017లో టీడీపీ ప్రభుత్వం నిర్మించిన ఇళ్లు తమకు మంజూరయ్యాయని, అప్పట్లో రూ.25వేలు వంతున డీడీలు చెల్లించినా ఇళ్లు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. ఈ మేరకు లబ్ధిదారులు సోమవారం పెదగంట్యాడ పీహెచ్‌సీ వద్ద ఆందోళనకు దిగారు. ఆపై బీసీ రోడ్డు మీదుగా పెదగంట్యాడ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పెదగంట్యాడ పీహెచ్‌సీ వద్ద శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన జోన్–6 జోనల్ కమిషనర్ బీఆర్ ఎస్ శేషాద్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. కనీస సదుపాయాలు అయిన రోడ్లు, కాలువలు, విద్యుత్, తాగునీరు కల్పించి వెంటనే గృహాలను అందజేయాలని కోరారు. స్పందించిన కమిషనర్ ఈ నెల 26 తర్వాత స్వయంగా వచ్చి పరిశీలిస్తానని చెప్పారు.



పెదగంట్యాడలో ర్యాలీ నిర్వహిస్తున్న టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు

నడుపూరు పాఠశాలలో డైరీ ఆవిష్కరణ

పెదగంట్యాడ: ప్రభుత్వ పాఠశాలల్లో డైరీ సంప్రదాయాన్ని తీసుకురావడం అభినందనీయమని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు రూపొందించిన డైరీని సోమవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు డైరీలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాలతో పాటు విద్యార్థులకు ఇచ్చే హోమ్ వర్క్‌ను అందులో రాయడం ద్వారా తల్లిదండ్రులతో ఉపాధ్యాయులకు కమ్యూనికేషన్ ఏర్పడుతుందన్నారు. ఎస్ఎంఎస్ఎస్‌లో సాధించిన ఫలితాల్లో కూడా మూడేళ్లగా పాఠశాల ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, ఉపాధ్యాయులు నారాయణరావు, కిరణ్, అప్పలరాజు, రమేష్, యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్ పుష్పాంజలి, వైస్ చైర్మన్ శివప్రసాద్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులు రూపొందించిన డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తదితరులు

హెచ్‌ఆర్‌ఏ కొనసాగించాల్సిందే..

కార్మిక సంఘాల డిమాండ్

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఇంటి అద్దె (హెచ్ఆర్ఏ), ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ, ఎల్‌టీఏలను నిలిపి వేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉక్కు అడ్మిన్ బిల్డింగ్‌లో ఈ అంశంపై ఆందోళన చేశారు. సీఎండీ కార్యాలయం ముందు బైఠాయించారు. దీంతో హెచ్‌ఆర్ సీజీఎం కార్మిక సంఘాలతో జరిగిన చర్చల్లో డైరెక్టర్ (పర్సనల్) సమక్షంలో చర్చలు జరపడానికి ప్రతిపాదించారు. దీనికి అంగీకరించని కార్మిక సంఘాలు నిర్ణయాధికారం ఉన్న సీఎండీతో మాట్లాడతామని పట్టుబట్టారు. దీంతో సీఎండీ అరుణ్ కాంతి బాగ్చీ, డైరెక్టర్ ఎస్.సి. పాండే, హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీలతో చర్చించారు. ఉత్తర్వులు రద్దుపై పున:పరిశీలించడానికి సీఎండీ బాగ్చీ సమయం కోరారని నాయకులు తెలిపారు. సమావేశంలో నాయకులు జె. అయోధ్యరామ్, కె.ఎస్.ఎన్. రావు, గణపతిరెడ్డి, నమ్మి సింహాద్రి, వరసాల శ్రీనివాస్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ సీఎండీ, డైరెక్టర్లతో చర్చలు జరుపుతున్న కార్మిక నాయకులు

ఉత్సాహంగా క్రీడా పోటీలు



ఖోఖో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



గాజువాక హైస్కూల్‌లో కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

గాజువాక: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం ప్రారంభమయ్యాయి. 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు ఈ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒలంపిక్స్‌లో పతకాలు సాధించే స్థాయికి విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నట్టు గాజువాక హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.విజయ ప్రశాంతి తెలిపారు. విద్యార్థులకు తొలిరోజు ఖోఖో, కబడ్డీ, యోగా, వాలీబాల్ తదితర పోటీలు నిర్వహించారు.

మ్యాజిక్‌లో విజయకుమార్ ప్రతిభ

ఉక్కునగరం: అంతర్జాతీయ స్థాయి మ్యాజిక్ కన్వెన్షన్ లో స్టీల్‌ప్లాంట్ విశ్రాంత అధికారి కొల్లాబత్తుల విజయకుమార్‌కు మెడల్ లభించింది. ఈనెల 21, 22 తేదీల్లో ఢిల్లీలోని రాయ్ కేదారనాథ్ ఆడిటోరియంలో మ్యాజిక్ ఫెస్టివల్ పేరిట ఐబీఎం ఇంటర్నేషనల్ మ్యాజిక్ కన్వెన్షన్ నిర్వహించారు. ఈ ఫెస్టివల్‌లో వివిధ దేశాలకు చెందిన 330 మంది మెజీషియన్లు పాల్గొన్నారు. రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన వరల్డ్ బుక్ ఆఫ్ టాలెంట్ రికార్డ్‌లో 117 మంది మెజీషియన్లు పాల్గొన్నారు. అందులో భాగంగా సంచిలో జాతీయ జెండాకు చెందిన మూడు రంగుల క్లాతులు వేసి అందులో నుంచి జెండా కర్రతో పాటు జాతీయ జెండా సృష్టించిన విజయకుమార్ ప్రదర్శనకు మెడల్ లభించింది. డాక్టర్ స్టిక్ మనోహర్ చేతుల మీదుగా విజయకుమార్ మెడల్, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా అతనికి పలువురు అభినందనలు తెలిపారు.



మెడల్ అందుకుంటున్న విజయకుమార్

రూ.50 లక్షలతో ఆస్పత్రి అభివృద్ధి

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వారు నెల్లిముక్కు పీహెచ్‌సీ వద్ద రూ.50 లక్షలతో నిర్మించనున్న పబ్లిక్ హెల్త్ అదనపు భవన నిర్మాణానికి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్ హెల్త్ బ్లాక్ నిర్మాణం ద్వారా పీహెచ్‌సీకి వచ్చే రోగులకు వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా ఉంటుందని చెప్పారు. అనంతరం ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ప్రసంగించారు. కార్యక్రమంలో జోన్– 6 జోనల్ కమిషనర్ బుద్ధా శేషాద్రి, జనసేన గాజువాక ఇన్‌చార్జి కోన తాతారావు, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, దల్లి గోవిందరెడ్డి, పల్లా శ్రీనివాసరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు, ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ వద్ద భవన నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు